

కమీషన్లు వస్తే ఒకే..!



ఈ ఫొటోలో ఉన్న వాహనం అనంతపురం డివిజన్ డిప్యూటీ డీఈఓకు అద్దెకు ఏర్పాటు చేసింది. ఏడు నెలల నుంచి అద్దె పెండింగ్‌లో ఉంచారు. గుత్తి డివిజన్ డిప్యూటీ డీఈఓకు అద్దెకు ఏర్పాటు చేసిన వాహనానికి తొమ్మిది నెలల నుంచి అద్దె చెల్లించ లేదు. దీంతో అద్దెకు వాహనాలను ఏర్పాటుచేసినవారు లబోదిబోమంటున్నారు. నెలల తరబడి అద్దె ఇవ్వకుంటే తమ జీవితాలు ఎలా గడుస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షలు సమీపించాయి. ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్, మార్చి తొలివారంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు, మార్చి 18 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మొదలౌతాయి. కేజీబీవీల్లో వందలాది మంది విద్యార్థినులు టెన్త్, ఇంటర్ చదువుతున్నారు. ప్రాజెక్టు నుంచి సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు తరచూ కేజీబీవీలను విజిట్ చేయాల్సి ఉంటుంది. కానీ అద్దె చెల్లించకపోవడంతో వాహన సేవలను చాలామంది సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఆఫీసర్లకు నిలిపేశారు. నిధులు లేక అద్దె బకాయిలు ఉన్నాయేమో అనుకుంటే పొరపాటే. వాహన అద్దెల బిల్లులు మంజూరు చేసే ఓ అధికారి.. తన వాహనానికి మాత్రమే అద్దె ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. మిగిలినవారివి చెల్లించడం లేదు. అక్కడే అసలు కథ ఉందట



ఇన్‌చార్జ్ డీఈఓకు కేటాయించిన అద్దె వాహనం

- 'ఆదాయం' రాని ఫైల్స్ పక్కకే..!
- సమగ్ర శిక్షలో ఓ అధికారి తీరిది..!
- పేరుకుపోయిన వాహన అద్దెలు
- ఆ ఒక్క వాహనానికే చెల్లింపులు..!
- వాహనదారుల జీవనం దుర్భరం



అనంతపురం విద్య

సమగ్ర శిక్షలో ఓ అధికారి కమీషన్ల కక్కుర్తి కొందరి జీవితాలను దుర్భరంగా మారుస్తోంది. పొట్ట కూటి కోసం అద్దెకు వాహనాలను నడుపుకునేవారికి పూట గడవడం కష్టమైంది. ప్రాజెక్టు అధికారులకు కొందరు వాహనాలను ఏర్పాటు చేశారు. వాటికి నెల నెలా వచ్చే అద్దెతో కుటుంబ జీవనం సాగిస్తున్నారు. వీరి పరిస్థితిని అర్థం చేసుకుని, బడ్జెట్ లేనప్పుడు నెలనెలా కాకపోయినా, రెండు మూడు నెలలకు ఒకసారైనా అద్దె చెల్లించాలి. కానీ ఏడు నెలలు, తొమ్మిది నెలల నుంచి పైసా ఇవ్వడంలేదు. ఇతర అధికారుల వాహనాలకు నెలల తరబడి పెండింగ్ పెట్టి.. ఆయన వాడే వాహనానికి మాత్రం నెల నెలా క్రమం తప్పకుండా అద్దె చెల్లిస్తున్నారు. వచ్చిన నిధులను తనకు కమీషన్ లభించే బిల్లుల చెల్లింపులకు వినియోగిస్తున్నారని ఆ అధికారిపై ఆరోపణలు ఉన్నాయి. వాహన అద్దె బిల్లులు చెల్లిస్తే తనకు ఒరిగేది ఏమీ ఉండదని, ఆయన అలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొందరు బాధితులు వాపోతున్నారు. గతంలో పలువురు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులకు అద్దె వాహనాలు ఉండేవి. కానీ అద్దె బకాయిలు పేరుకుపోవడంతో సేవలు నిలిచిపోయాయి.

● పాపం.. వాహనదారులు

● వేల రూపాయలు జీతం తీసుకునే ఉద్యోగులు, అధికారులే.. ఒక నెల జీతం ఆలస్యమైతే జేబులు తడుముకుంటాము. చేబదులో, అప్పో చేస్తారు. అలాంటిది.. అద్దె వాహనాలు పెట్టుకుని జీవితాలను నెట్టుకొచ్చేవారి పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. సమగ్ర శిక్ష ప్రాజెక్టు ద్వారా డీఈఓ కార్యాలయం, సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయంలో ఉండే ఉన్నతాధికారులకు అద్దె వాహనాలు ఏర్పాటుచేస్తారు. ఒక్కో వాహనానికి నెలకు రూ.35 వేలు అద్దె చెల్లిస్తారు.

● ప్రాజెక్టు తరఫున డీఈఓ, అనంతపురం, గుత్తి డివిజన్ల డిప్యూటీ డీఈఓలు, సమగ్రశిక్ష ప్రాజెక్టు లోని పలువురు ఉన్నతాధికారులకు అద్దెకు వాహనాలు ఏర్పాటు చేశారు. అనంతపురం డిప్యూటీ డీఈఓ వాహనానికి 2023 జూన్ నుంచి ఏడు నెలల అద్దె చెల్లించాల్సి ఉంది. గుత్తి డిప్యూటీ డీఈఓ వాహనానికి 2023 ఏప్రిల్ నుంచి 9 నెలల అద్దె పెండింగ్‌లో ఉంచారు. పలువురు ఇంజనీర్ల వాహనాల బిల్లులను కూడా చెల్లించలేదు. వాహనదారుల, అధికారులు ఎవరైనా 'బిల్లులు పెట్టండి' అని అడిగితే.. బడ్జెట్ రాలేదనో, చూద్దాం.. చేద్దాం అనో కాలం గడుపుతున్నారని ఆ అధికారిపై విమర్శలు వస్తున్నాయి. డీఈఓ వాహనానికి రెండు నెలల అద్దె మాత్రమే పెండింగ్‌లో ఉంచినట్లు సమాచారం. ప్రాజెక్టులో తిష్ట వేసి.. కమీషన్లు కొల్లకొడుతున్న ఆ అధికారి మాత్రం తన వాహనానికి ప్రతి నెలా బిల్లులు చేసుకుంటున్నారని సమాచారం. 'ఎవరెట్ల పోతే నాకెందుకు.. నేను బాగుంటే చాలు' అన్నట్లుగా ఆయన వ్యవహరిస్తారని విమర్శలు వస్తున్నాయి.

● ఏమిటీ ఖర్మ..?

ప్రాజెక్టులోకి అయ్యగారు వచ్చిన వేళా విశేషం.. పలువురికి వాహన కష్టాలు మొదలయ్యాయి. ఏఎంఓ, అసిస్టెంట్ ఏఎంఓ, జీసీడీఓ, అసిస్టెంట్ సీఎంఓ, ఎఫ్ఏఓ, అసిస్టెంట్ అలెస్కో, ఇతర అధికారులు తనిఖీలకు ప్రాజెక్టులో అందుబాటులో ఉండే అద్దె వాహనాలను వినియోగించుకునేవారు. ఒకటి లేదా రెండు వాహనాలున్నా.. సదరు అధికారులతో పాటు ఏఎస్ఓ, ఏపీఓ, క్లరికల్ స్టాఫ్ ఉపయోగించే వారు. కేజీబీవీల తనిఖీలు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు కలెక్టరేట్‌కు వెళ్లడం, సీఎం, మంత్రుల కార్యక్రమాలకు ఈ వాహనాలను వినియోగించే వారు. అద్దె బకాయిల కారణంగా కొన్ని నెలల నుంచి సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులకు వాహనాలు లేకుండా పోయాయి.

● పక్కన పెట్టేయండి..

అద్దె వాహనాలకు బిల్లులు చేద్దామని ప్రాజెక్టులోని ఓ అధికారి వద్దకు క్లరికల్ స్టాఫ్ తీసుకువెళితే.. 'ఇప్పుడు అంత అర్జెంటుగా చేయాలా..? పక్కన పెట్టేయండి మళ్లీ చూద్దాం' అని ఆయన ఫైళ్లను తిరస్కరించారని సమాచారం. బడ్జెట్ ఉన్నప్పుడు కమీషన్లు వచ్చే ఫైళ్లపై ఆగమేఘాల మీద సంతకాలు చేస్తారని, జీవనోపాధి కోసం అద్దెకు వాహనాలను ఏర్పాటు చేసినవారి ఫైళ్లను మాత్రం పక్కన పెట్టేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేయలేక, ఎవరికీ చెప్పుకోలేక ఉద్యోగులు, వాహనదారులు నలిగిపోతున్నారు.

స్టే ఉన్నా.. ప్రారంభోత్సవం



రిబ్బన్‌కట్ చేసి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి, జనవరి 31: మండల పరిధిలోని చిన్నపొలమడ వద్ద నిర్మించిన వివాదాస్పద ఆర్టీఏ కార్యాలయాన్ని ఎమ్మెల్యే పెద్దారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఎంవీఐలు శ్రీనివాసులు, రాజగోపాల్ ఈ కార్యక్రమానిక హాజరయ్యారు. ఈ కార్యాలయ భవన నిర్మాణానికి వ్యతిరేకంగా టీడీపీ మద్దతుదారులు హైకోర్టు నుంచి స్టే తెచ్చారు. కానీ అధికారులు మాత్రం 383-2 సర్వే నంబర్‌లోని 3.39 ఎకరాల భూమిపై మాత్రమే స్టే ఉందని అంటున్నారు. ఈ సర్వే నంబర్ పక్కన, సర్వే నంబర్ 382-బీలో 61 సెంట్ల స్థలాన్ని ఆర్టీఏ కార్యాలయ భవనం కోసం గతంలో కేటాయించారని, అందులోనే భవన నిర్మాణం జరిగిందని అంటున్నారు. తహసీల్దారు ధ్రువీకరించిన ప్రాంతంలోనే భవనం నిర్మించారని, ఎమ్మెల్యే సూచనల మేరకు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఆర్టీఏ కార్యాలయానికి చెందిన ఓ అధికారి తెలిపారు.

రియల్ వ్యాపారం కోసమేనా..?

ఆర్టీఏ కార్యాలయ భవనాన్ని ఓ దాత నిర్మించారు. ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకోవాలన్న ఉద్దేశంతోనే ఆ భవంతిని స్వచ్ఛందంగా నిర్మించి ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. ఆర్టీఏ కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం నిధులను కేటాయించలేదు. దీంతో తాడిపత్రి మార్కెట్ యార్డులోని అద్దె భవనంలో కార్యాలయం కొనసాగుతోంది. కొన్నేళ్లుగా భవనం లేకపోవడంతో దాత ముందుకు వచ్చారని అధికారులు సమర్థించుకుంటున్నారు. పట్టణంలో ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయని, వాటికి భవనాలను నిర్మించడానికి రాని దాతలు ఆర్టీఏ కార్యాలయం విషయంలో ఎందుకు వచ్చినట్లు అన్న చర్చ జరుగుతోంది.

ఇంకా ఎగురుతోంది..!



బొమ్మనహాళ్ మండలం దర్గాహోన్నూరు ఒకటో సచివాలయం పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ ఇది. ప్రభుత్వ కార్యాలయమే అయినా.. వైసీపీ జెండా ఎగురుతోంది. 'ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా.. కొన్నాళ్ల క్రితం దీన్ని అధికార పార్టీ నాయకులు ఎగురవేశారు. అప్పట్లోనే దీనిపై విమర్శలు వచ్చాయి. అయినా అధికారులు స్పందిచలేదు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగరేసేందుకైనా అధికార పార్టీ జెండాను తొలగిస్తారని ప్రజలు భావించారు. కానీ అదీ జరగలేదు.

- బొమ్మనహాళ్

ఇది వేధింపుల పాలన

● వైసీపీ ప్రభుత్వంపై యూటీఎఫ్ మండిపాటు



రిలేదీక్షలు చేస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జనవరి 31: ఉపాధ్యాయులు, ఉద్యోగుల అండతో అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ వర్గాలను వేధించడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని యూటీఎఫ్ నాయకులు మండిపడ్డారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల సాధన కోసం కలెక్టరేట్ వద్ద బుధవారం వారు రిలే దీక్షలకు దిగారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గోవింద రాజులు, జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వప్ప ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్యోగులకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాష్ట్ర ఉద్యోగుల వేతనాల్లో కోత విధించి, చరిత్రకెక్కారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చాక వారం రోజుల్లో సీపీఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన జగన్.. ఇచ్చిన మాట తప్పారని, దుర్మార్గమైన జీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను సీఎం నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. ఎన్నో పోరాటాలు చేసి రద్దు చేయించుకున్న అంప్రెంటిస్ విధానాన్ని మళ్లీ ఈ ప్రభుత్వం తీసుకురావడానికి ప్రయత్నాలు చేయడం దారుణమని అన్నారు. కేబినెట్ సమావేశంలో డీఏ, ఐఆర్ ప్రకటన వస్తుందని ఉద్యోగులు ఆశించారని, ఆశాభంగం ఎదురైందని అన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను చెల్లించాలని, పెండింగ్ డీఏ, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు సరళ, ప్రమీళ, దేవేంద్రమ్మ, సుబ్బరాయుడు, నాగేంద్ర, వెంకటనాయుడు, గంగాధర్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎల్లిపోదాం పాండప్పా..!

- కష్టపడి పనిచేసి ఏం లాభం..?
- పద్మావతిని వద్దంటే.. వాళ్ల మనిషికే టిక్కెట్టా..?
- గెలిపిస్తే మళ్లీ వాళ్ల కుటుంబ పాలనే కదా..?
- వైసీపీని వీడి.. టీడీపీలోకి వెళితే పోలా..!
- ద్వితీయ శ్రేణి నాయకుల అంతర్మథనం



బుక్కరాయసముద్రం, జనవరి 31: శింగనమల నియోజకవర్గంలో కొత్త ఇన్‌చార్జి నియామకం అధికార పార్టీలో ముసలం పుట్టిస్తోంది. 'ఆమె వద్దు. ఇంకెవరికి టిక్కెట్ ఇచ్చినా పని చేస్తాం..' అని అసమ్మతి నాయకులు పార్టీ అధిష్టానానికి చెప్పేశారు. 'దీని అర్థం.. ఆమెతో పాటు.. ఆమె సంబంధీకులు కూడా వద్దు..' అని కదా అని వారు ప్రశ్నిస్తున్నారు. ఆమె వద్దంటే.. ఆమె ఇంట్లో మనిషిని తెచ్చి అభ్యర్థిగా పెట్టడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అసమ్మతి వర్గీయుల్లో అంతర్మథనం మొదలైంది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డికి వ్యతిరేకంగా నియోజకవర్గంలోని ద్వితీయ శ్రేణీ నాయకులు నాలుగు రోజుల క్రితం అనంతపురంలో భేటీ అయ్యారు. కొత్త సమన్వయకర్త వీరాంజినేయులు ఎన్నికల్లో పోటీ చేస్తే.. పార్టీకి దూరంగా ఉండాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. సమన్వయకర్తను మార్చకపోతే టీడీపీలోకి వెళితే ఎలా ఉంటుందని కూడా కొందరు ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మావతిని కాకుండా పార్టీ అధిష్టానం నూతన అభ్యర్థిని నియమిస్తుందని ద్వితీయ శ్రేణీ నాయకులు ఎదురుచూశారు. వారికి వ్యతిరేకంగా, తమకు అనుకూలంగా ఎవరో ఒకరికి టిక్కెట్ ఇస్తారని భావించారు. కానీ చివరికి ఆలూరు సాంబశివారెడ్డి సూచించిన, ఆయన సొంత మనిషి వీరాంజినేయులకు టిక్కెట్ ఇచ్చారు. దీన్ని అసమ్మతి వర్గం జీర్ణించుకోలేకపోతోంది.

మార్చాల్సిందే..


ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా, నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు 200 మంది వరకూ సమావేశానికి హాజరయ్యారని తెలిసింది. అభ్యర్థిని మార్చకపోతే ఎన్నికల్లో పనిచేసే ప్రసక్తే లేదని పలువురు అన్నట్లు సమాచారం. అభ్యర్థిని మార్చాలని పార్టీ అధిష్టానాన్ని కోరాలని తీర్మానించినట్లు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశానికి బుక్కరాయసముద్ర మండలం మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి, సహకార సంఘం చైర్మన్ గువ్వల వెంకటరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్‌లు ఎస్.నాగలింగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ సాకే రామక్రిష్ణ, రామ్మోహన్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. గార్లదిన్నె మండలం నుంచి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, శింగనమల మండల కన్వీనర్ పట్నం నాగేష్, నాయకులు గోకుల్ రెడ్డి, నార్పల మండలం నుంచి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి వర్గం, పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి ఎమ్మెల్యే పెద్దారెడ్డి వర్గం హాజరైనట్లు తెలిసింది.

మళ్లీ కుటుంబ పాలనేనా..?

వైసీపీ కొత్త అభ్యర్థి వీరాంజినేయులను గెలిపిస్తే నియోజకవర్గంలో మళ్లీ కుటుంబపాలనే సాగుతుందని పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ పల్లకి మోశామని, ఎస్సీ నియోజకవర్గంలో ఎస్సీలకే ప్రాధాన్యం లేకుండా పోయిందని పలువురు వ్యాఖ్యానించినట్లు తెలిసింది. 2019 ఎన్నికల్లో జొన్నలగడ్డ పద్మావతి గెలుపు కోసం తీవ్రంగా కృషి చేశామని, అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు మండలాల్లో నాయకులు ఎలాంటి గుర్తింపు లేకుండా చేశారని వాపోయినట్లు సమాచారం. ఐదేళ్ల పాలనలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకే పెద్దపీట వేశారని వారు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన నియోజకవర్గ సమీక్షా సమావేశానికి దూరంగా ఉన్నారు. సీఎం జగన్ జిల్లా పర్యటనకు వచ్చిన సమయంలో శింగనమల అభ్యర్థిని మార్చాలనం తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి కోరినా.. సీఎం స్పందించకుండా వెళ్లిపోయినట్లు సమాచారం. ఫిబ్రవరిలో అనంతపురంలో జరిగే సిద్ధం కార్యక్రమానికి సీఎం వస్తున్నారని, ఆ సమయంలో అభ్యర్థిని మార్చాలని కోరాలని శింగనమల నియోజకవర్గ ద్వితీయ శ్రేణి నాయకులు నిర్ణయించుకున్నట్లు సమాచారం.

విశ్వసనీయతకు మాదిగలు మారుపేరు

మాదిగల మహా సమ్మేళనంలో నాయకులు



ఐక్యత చాటుతున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 31: మాదిగలు విశ్వసనీయతకు మారుపేరు అని పలువురు నాయకులు అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో బుధవారం మాదిగల మహాసమ్మేళనాన్ని నిర్వహించారు. బంగి నాగ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యే యామినీబాల, ఐ-టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శివానంద తదితరులు హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్ భవన్ నుంచి జిల్లా పరిషత్ వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు ప్రసంగించారు. విద్యార్హతలతో సమాజ గుర్తింపు లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. జిల్లాస్థాయి పదవుల్లో మాదిగలకు చోటు కల్పించడంలేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణ చేసి జనాభా దామాషా మేరకు ఆర్థిక, రాజకీయ, సంక్షేమం తదితర అంశాల్లో మాదిగలకు వాటాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే శివశంకర్, వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి చామలూరు రాజగోపాల్, బహుజన చైతన్యవేదిక రామకృష్ణ, కుళ్లాయప్ప, జడ్పీటీసీ నాగరాజు, బేకరి గంగాధర, బీఎస్ఎన్ఎల్ రాజారమేష్, నల్లప్ప, దంపెట్ల శివ, కేపీ నారాయణస్వామి, టీసీఆర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎప్పుడు తేలుస్తారో..!



- వైసీపీ సిట్టింగుల్లో టిక్కెట్ గుబులు
- కొత్త ఇన్‌చార్జిలకు అసమ్మతి సెగ
- ఐదో జాబితాలో కనిపించని పేర్లు
- ఆరో జాబితా కోసం ఆశావహుల నిరీక్షణ



అనంతపురం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నోటిఫికేషన్ సమయం దగ్గర పడుతోంది. టిక్కెట్ ఉంటుందా..? ఊడుతుందా..? అని వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యేలలో గుబులు మొదలైంది. జాబితాలో తమ పేరు కోసం ఎదురు చూస్తూ.. రోజులు లెక్కబెడుతున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాలకు సమన్వయకర్తలను ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలు ఉన్నాయి. ఇందు లో పార్లమెంటు స్థానాలకు, పెనుకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం, మడకశిర, కదిరి, శింగనమల అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జిలను ప్రకటించా రు. మిగిలిన ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల విషయం తేల్చలేదు. కొత్తగా నియమితులైన ఇన్‌చార్జిలే ఈ ఎన్నికల్లో అభ్యర్థులు అని ఆ పార్టీ చెప్పకనే చెప్పింది. దీంతో ఐదో జాబితాలో తమ పేరు కోసం సిట్టింగ్ ఎమ్మెల్యేలు, పాత ఇన్‌చార్జిలు ఉత్కంఠగా ఎదురు చూశారు. కానీ ఐదు జాబితాలో ఉమ్మడి జిల్లాలో ఒక్కరి పేరూ ప్రకటించలేదు. అతి త్వరలో ఆరో జాబితా విడుదల చేస్తుందని భావిస్తున్నారు. ఆ భారీ జాబితా ఎప్పుడెప్పుడా అని ఉమ్మడి జిల్లా సిట్టింగ్‌లు, ఇన్‌చార్జిలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

సిట్టింగులకు ఫిట్టింగు

వైసీపీ అధిష్ఠానం ఐదు విడతలుగా నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలను ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. పెనుకొండ సిట్టింగ్ ఎమ్మెల్యేను అనంతపురం, కర్ణాటకలోని బళ్లారి మాజీ ఎంపీ శాంతను హిందూపురం పార్లమెంటు అభ్యర్థులుగా ఖరారు చేసింది. కళ్యాణదుర్గం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్‌ను పెనుకొండకు, అనంతపురం ఎంపీ తలారి రంగయ్యను కళ్యాణదుర్గం నియోజకవర్గానికి బదిలీచేసి.. అభ్యర్థులుగా ప్రకటించింది. మడకశిర, కదిరి, శింగనమల, రాయదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండిచేయి చూపింది. ఆ నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ నిరాకరించింది. వారి స్థానంలో.. మడకశిరకు ఈర లక్కప్ప, కదిరికి మక్బూల్ బాషా, శింగనమలకు వీరాంజనేయులు, రాయదుర్గానికి మెట్టు గోవిందరెడ్డిని ఇన్‌చార్జిలుగా నియమించింది.



నివురుగప్పిన నిప్పు

శింగనమల నియోజకవర్గంలో అసమ్మతి లోలోన బుసలుకొడుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డి తమ అనుయాయుడికే టిక్కెట్ ఖరారు చేయించుకున్నారు. దీంతో ఆశావాహులు, మరీ ముఖ్యంగా కొందరు ముఖ్య దళిత నేతలు, అధికార పార్టీ సామాజికవర్గం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా... ఆ నియోజకవర్గ ఇన్‌చార్జిని పరిచయం చేసేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కొందరు ముఖ్యులు హాజరుకాలేదు. అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. రానున్న ఎన్నికల్లో అసమ్మతి సెగ అభ్యర్థికి తప్పదని ఆ పార్టీ శ్రేణులే అంటున్నాయి.

చూసుకుందాం..



తమను కాదని, కొత్తవారికి అవకాశం ఇవ్వడంతో సిట్టింగులు పార్టీ అధిష్ఠానంపై గుర్రుగా ఉన్నారు. ఇప్పటికే కొందరు ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నారు. ఆ బాటలో రాయదుర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ముందువరుసలో ఉన్నారు. టికెట్ లేదని మొహం మీదే చెప్పేయడంతో.. తాడేపల్లి ప్యాలెస్‌కు గుడ్ బై చెప్పి వచ్చారు. ఆ క్షణం నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా కాకుండా, స్వతంత్ర ఎమ్మెల్యే తరహాలో వ్యవహరిస్తున్నారు. కాపు వ్యాఖ్యలు నియోజకవర్గంలోనే కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. 'నా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు ఇచ్చింది. సీఎం జగన్ జేబులో నుంచి ఇవ్వలేదు..' అని తాజాగా చేసిన వ్యాఖ్యలు ఆయనలో కసి ఏ స్థాయిలో ఉందో చెప్పకనే చెబుతున్నాయి. రాయదుర్గం నియోజకవర్గం వైసీపీలో చీలిక అనివార్యమైంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయారు. పార్టీ అధినాయకత్వంపై అసమ్మతి రోజురోజుకు పెరిగిపోతోంది. కొత్త ఇన్‌చార్జి మెట్టు గోవిందురెడ్డి శిబిరంలో అలజడి రేగుతోంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసమ్మతి సెగను ఊహించుకుని, మెట్టు శిబిరం ఆందోళన చెందుతోంది.



దూరం దూరంగా..

కదిరి సిట్టింగ్ ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి టిక్కెట్ నిరాకరించారు. దీంతో ఆయన వర్గం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సిద్దారెడ్డితో చర్చలు జరిపేందుకు ప్రయత్నించినా, ఆయన అందుబాటులోకి రాలేదు. దీన్నిబట్టి సిద్ధారెడ్డి వర్గం అధిష్టానంపై తీవ్ర అసంతృప్తితో ఉందని స్పష్టమౌతోంది. ఈ పరిణామాలు తాజా ఇన్‌చార్జిపై తప్పక ప్రభావం చూపుతాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మడకశిరలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే తిప్పేస్వామి అధిష్ఠానం నిర్ణయంపై తీవ్రస్థాయిలో అసంతృప్తిలో ఉన్నారు. ఆయన వర్గీయులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఎటు వెళ్లాలో తేల్చుకోలేక సతమతమవుతున్నారు.

ఆరుగురిలో ఉత్కంఠ

వైసీపీ అధిష్ఠానం ఇప్పటి వరకూ ఆరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లయింది. మిగిలిన నియోజకవర్గాల్లో.. ఆరుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్ గుబులు పట్టుక్కుంది. అనంతపురం అర్బన్, గుంతకల్లు, ధర్మవరం, రాప్తాడు, పుట్టపర్తి, తాడిపత్రి సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఐదో జాబితాలో తమ పేరు ఉంటుందని ఉత్కంఠగా ఎదురు చూశారు. కాజీ జిల్లాలో ఏ ఒక్కరి పేరూ అందులో రాలేదు. పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఇప్పటికే తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించినట్లు సమాచారం. మిగిలిన సిట్టింగ్‌లు తాడేపల్లి ప్యాలెస్ నుంచి పిలుపు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నారు. పిలుపు వస్తే.. అటు ఇటో తేలిపోతుందని, ఉత్కంఠతకు తెరపడుతుందని సిట్టింగ్‌లు అంటున్నారు. ఐదులో తేలకపోవడంతో ఇక ఆరో జాబితా కోసం ఎదురు చూస్తున్నారు. తాజా పరిస్థితులు సిట్టింగులో కలవరం పుట్టిస్తున్నాయి. ఎన్నికలు దగ్గరపడుతున్నా ఎటూ తేల్చకపోవడంతో కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి దాకా ప్రకటించని నియోజకవర్గాలకు అధికశాతం అధికార పార్టీ సామాజికవర్గ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలే ఉన్నారు. బీసీలకు పట్టున్న జిల్లా కావడంతో ఆ సామాజికవర్గం వారు టిక్కెట్ వస్తుందో రాదోనన్న ఆందోళనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరో జాబితా ఎందరికి వరమౌతుందో.. మరెందరికి నిరాశ మిగిలిస్తుందో వేచి చూడాల్సిందే.

రెవెన్యూలో ఎన్నికల బదిలీలు

- అనంత డీఆర్‌ఓగా రామక్రిష్ణారెడ్డి
- ఉమ్మడి జిల్లాలో 55మంది తహసీల్దార్లకు స్థానచలనం

అనంతపురం టౌన్, జనవరి 31: ఉమ్మడి అనంత జిల్లా రెవెన్యూ శాఖలో ఎన్నికల బదిలీలు భారీగా జరిగాయి. అత్యంత కీలకమైన డీఆర్‌ఓ పోస్టుకు కొత్తవారిని నియమించారు. అనంత డీఆర్‌ఓగా రామక్రిష్ణారెడ్డిని నియమించారు. ఈయన తహసీల్దార్‌గా అనేక మండలాల్లో పనిచేశారు. ప్రస్తుతం కడప జిల్లా నుంచి ఇక్కడికి డీఆర్‌ఓగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న డీఆర్‌ఓ గాయిత్రీదేవిని విజయవాడ డైరెక్టరేట్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే ఎన్నికల నిబంధనల మేరకు అనంత, సత్యసాయి జిల్లాల్లో ఒకేసారి 55 మంది తహసీల్దార్లను బదిలీ చేశారు. పక్క జిల్లాలైన కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు వా రికి పోస్టింగ్‌లు ఇచ్చారు. బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు విడుదల చేశారు.

బదిలీ అయిన తహసీల్దార్లు వీరే...


ఉమ్మడి జిల్లానుంచి శ్రీధరమూర్తి, విజయలక్ష్మి, ఉషారాణి, షర్మిల, శేషారెడ్డి, ఈశ్వరమ్మ, రమాదేవి, హరికుమార్, మునివేలు, లక్ష్మీనాయక్, మోహన్‌కుమార్, సుమతి, ప్రతాప్‌రెడ్డి, మహబూబ్‌బాషా, సునీతాబాయి, నాగభూషణం, అనిల్‌కుమార్, ఈరమ్మ, ఓబిలేసు, నవాజ్‌అహ్మద్, విజయకుమారి, బాలక్రిష్ణ, ఫణికుమార్, మారుతి, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, వాణిశ్రీ, శ్రీధర్, ఈశ్వరయ్య శెట్టి, ఎస్‌బీ భాస్కర్, వసంతలత, నాగరాజు, నారాయణస్వామి, నీలకంఠారెడ్డి, వెంకటనారాయణ, అనుపమ, జిలాని, కరుణాకర్, రంగనాయకులు, ఎస్. నాగరాజు, జి.నాగేంద్ర, సయ్యద్ సైఫుద్దీన్, సుబ్బలక్ష్మమ్మ, జి.నాగరాజు, కె.శ్రీధర్, స్వర్ణలత, సురేష్‌కుమార్, అనంతాచారి, సౌజన్యలక్ష్మి హసీనాసుల్తానా, జి.నాగరాజు, మల్లికార్జున, వేణుగోపాల్, జమానుల్లాఖాన్ బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన తహసీల్దార్లను నియమించారు. ఎన్నికలు ముగిసేవరకు వీరే ఉంటారు. ఆ తర్వాత తిరిగి ఆయా జిల్లాలకు వెళ్లనున్నారు.

బాలల బీమాకు రూ.5 చెల్లించండి: ఏపీసీ

అనంతపురం విద్య, జనవరి 31: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకూ చదివే విద్యార్థులకు బాలల బీమా అమలు చేయనున్నట్లు ఏపీసీ వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కూడా జాతీయ బాలల బీమా పథకం అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ పథం కింద ప్రమాదవశాత్తు విద్యార్థి మరణిస్తే.. రూ.25 వేలు, తీవ్ర అంగవైకల్యం పొందితే రూ.10 వేలు బాధిత కుటుంబానికి అందజేస్తారన్నారు. అన్ని మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు ఫిబ్రవరి 10వ తేదీలోగా ప్రతి విద్యార్థి నుంచి రూ.5 బీమా కోసం వసూలు చేసి... వచ్చే నెల 15వ తేదీలోగా డీడీ ద్వారా అడిషనల్ ప్రాజక్టు కోఆర్డినేటర్, అనంతపురం పేరుపై సమగ్రశిక్ష కార్యాలయంలో అందజే యాలన్నారు.



కేటాయింపులుండేనా..?



- నేడు కేంద్ర బడ్జెట్ ● రైల్వేకి నిధుల కేటాయింపుపైనే అందరి దృష్టి ● పెండింగ్ ప్రాజెక్టులకు మోక్షం కలిగేనా..?

గుంతకల్లు, జనవరి31: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రవేశపెడుతున్న కేంద్ర మధ్యంతర బడ్జెట్‌లో రైల్వేకు కేటాయింపులు ఎలా ఉంటాయో అన్న ఆసక్తి నెలకొని ఉంది. పార్లమెంటు సమావేశాలు బుధవారం ప్రారంభంకాగా, గురువారం బడ్జెట్ సమావేశం జరగనుంది. రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా లేకపోగా, ఈ శాఖ కేటాయింపులు కూడా యూనియన్ బడ్జెట్ లోనే ప్రకటించనున్న నేపథ్యంలో కనీసం ఎన్నికల వేళైనా కొత్త రైళ్లు వచ్చేనా? అనే ఆసక్తి స్థానికంగా నెలకొని ఉంది. అలాగే ఎన్నాళ్ల నుంచో రైల్వే ఉద్యోగులు, కార్మికులు డిమాండ్ చేస్తున్న నూతన పింఛన్ విధానం రద్దు విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఈ మధ్యంతర బడ్జెట్టులో ప్రకటిస్తుందేమోనన్న ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఇన్నేళ్లకైనా మోక్షం కలిగేనా..?

కిందటి సంవత్సరం పెండింగ్ ప్రాజెక్టులకు నిధులు అంటూ హంగామా చేసినా కొన్ని పాత ప్రాజెక్టుల నిర్మాణంలో ఏమాత్రం చలనం ఏర్పడలేదు. గుంతకల్లు డివిజనల్ కేంద్రంలో నిర్మాణంలో ఉన్న రైల్వే ఎలక్ట్రిక్ ట్రాక్షన్ షెడ్డు పనులు ఏళ్లు పూర్తవుతున్నా ఎంతకూ తెమలడం లేదు. ఈ షెడ్ నిర్మాణానికి రూపకల్పన జరిగి 14 ఏళ్లు, పనులు ప్రారంభమై 8 ఏళ్లు అయినా పనులు పూర్తికావడానికి అవసరమైన నిధుల విడుదల జరగడంలేదు. అలాగే గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో తాగు నీటి అవసరాల కోసం నిర్మించతలపెట్టిన అదనపు రైల్వే సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పనులు స్తంభించిపోయాయి. నిధులు లేక ఎస్ఎస్ ట్యాంకు పనులు ల్యాండ్ లెవెలింగ్ తోనే నిలిచిపోయాయి. అత్యవసరంగా పూర్తి చేయాల్సిన ఈ ప్రాజెక్టును తాత్సారం చేస్తున్నారు. నీటి సదుపాయం లేనందున ఎన్నో రైళ్లకు గుంతకల్లులో నీటిని నింపకుండా పంపుతున్నారు. రైల్వే కాలనీల్లోని గృహసముదాయాలకు తగిన విధంగా నీటిని అందించలేకపోతున్నారు. గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ పనులకు నిధులను ఇచ్చినా పూర్తిచేయలేకపోయారు. కడప-బెంగళూరు మధ్య రూ. 2706 కోట్లతో చేపట్టిన కొత్తలైన్ నిర్మాణం నత్తనడకన నడుస్తోంది. శ్రీకాళహస్తి-నడికుడి లైన్ నిర్మాణానికి రూ. 2289 కోట్లతో మంజూరుచేయగా పనులు కొనసాగుతున్నాయి. గుంతకల్లులో ట్రాక్షన్ షెడ్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. విజయవాడ-గూడూరు మధ్య 3వ లైన్ నిర్మాణానికి 2016-17లో రూ. 3549 కోట్లతోనూ, అకోలా-డోన్ మధ్య కొత్త లైన్‌కు అనుమతులు లభించాయి. నిధులు రావడంలేదు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 1, 2-3 ప్లాట్‌ఫారాలను ఇతర ప్లాట్‌ఫారాలతో అనుసంధానం చేసే పనులు చేపట్టాల్సి ఉంది.

జనాకర్షకమేనా..?

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైల్వే ఉద్యోగులకు, ప్రయాణికులకు కేంద్రం తీపికబురేమైనా అందిస్తుందోమోనన్న ఊహ బడ్జెట్ పై ఆశలు పెంచుతోంది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టే బడ్జెట్‌ను కేవలం నిర్వహణ లక్ష్యంగానే ఇంటీరియం ప్రతిపాదించడం రివా జు. కానీ ఎన్నికల తరుణంలో ఏదైనా ప్రయోజనం చేకూర్చే అవకాశం లేకపోలేదన్న ఉత్సాహం రైల్వే ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ప్రజల్లో నెలకొని ఉంది. రైల్వే ఉద్యోగుల నుంచి పాత పింఛను విధానం పునరుద్ధరణతోపాటు, ఎనిమిదవ పే రివిజన్ కమిషన్ ఏర్పాటు కూడా డిమాండ్లు ఉన్నాయి. ఏపీఎస్ విషయంపై ఈ నెలాఖరుకు సార్వత్రిక సమ్మె విషయంగా కార్మిక సంఘాల సమావేశం నిర్వహించే విషయంగా కేంద్రానికి నోటీసును కూడా ఇచ్చిన నేపథ్యంలో వాటిపై ప్రకటన విషయంగా సంఘాలు ఎదురుచూస్తున్నాయి. కిందటి సంవత్సరం రైల్వేకు కొత్త ప్రాజెక్టులేవీ ప్రతిపాదించకుండా, కేవలం పెండింగు ప్రాజెక్టులకే కేటాయింపులు చేశారు. వందే భారత్ రైళ్లు కాకుండా డిమాండ్లు ఉన్న రూట్లలో కొత్త రైళ్లేమైనా వస్తాయా? అని ఎదురుచూస్తున్నారు.

కరోనా రైళ్లు కదిలేనా..?

కరోనాలో నిలిచి పోయిన రైళ్లను పునఃప్రారంభించే విషయంగా ప్రజల నుంచి డిమాండ్లు మూడేళ్లగా వస్తున్నాయి. పాత రైళ్ల విషయంగా స్థానికంగా డిమాండ్లు వస్తున్నా, రైల్వే అధికారులు, రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీల నుంచి ప్రతిపాదనలు వెళ్తున్నా ప్రభుత్వంలో చలనం రావడంలేదు. రద్దయిన హుబ్లీ-విజయవాడ, విజయవాడ-యశ్వంతపూర్, కర్నూలు-గుంతకల్లు ప్యాసింజరు రైళ్లు, కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఇప్పటి దాకా పునరుద్ధరించనేలేదు. అలాగే విజయవాడకు వెళ్లేందుకు కొత్త రైళ్లను వేయాలనే విషయంగా చేస్తున్న డిమాండ్లు అరణ్య రోదనగానే మిగులుతున్నాయి. ఇక ప్యాసింజరు రైళ్లకు కరోనా తర్వాత స్పెషల్ ఫేర్ ట్రెయిన్స్ అనే పేరుపెట్టి ప్రయాణికుల నుంచి రైలు టిక్కెట్ల రూపంలో మూడేళ్లగా అదనపు వసూళ్లు చేస్తున్నారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత వస్తున్నా యాజమాన్యం, కేంద్ర ప్రభుత్వం పెడచెవినపెడుతున్నాయి. ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న కేంద్ర బడ్జెట్ లో భారీ రైల్వే ప్రాజెక్టుల విషయంగా పెద్దగా అంచనాలు లేకపోయినా, కనీసం జనాకర్షణ కోసమైనా ఏవైనా ప్రయోజనాలు కలుగుతాయేమోనని వేచి చూస్తున్నారు.



గుంతకల్లు రైల్వే స్టేషన్

సొంత పార్టీ నేతలకే జగన్ వ్యవహారాలు నచ్చడం లేదు

- టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



అనంతపురం అర్బన్, జనవరి 31: సొంత పార్టీ నేతలకే జగన్ వ్యవహారాలు నచ్చడం లేదని టీడీపీ ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అనంతపురం నగరంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైకోర్టు, సుప్రీం కోర్టులు జగన్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొట్టికాయలు వేసినా సీఎంకు బుద్ధిరావడం లేదన్నారు. సుప్రీం కోర్టులో ఇన్నర్ రింగ్ రోడ్డు అంశంపై ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను కొట్టివేసిందంటే జగన్ ప్రభుత్వం టీడీపీ ముఖ్యనేతలపై ఎన్ని కుట్రలు చేశారో అర్థం చేసుకోవచ్చునన్నారు. వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను చంద్రబాబు ప్రజల్లో తీసుకువెళుతున్నారన్న అక్కసుతోనే ఆయనపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. స్కిల్ డెవలప్‌మెంట్ అంశంలో ఎలాంటి తప్పు చేయకపోయినా చంద్రబాబును జైలుకు పంపించారని దుయ్యబట్టారు. కోర్టుల్లోనూ న్యాయం జరగడం ఆలస్యం కావొచ్చుగానీ.. అంతిమంగా న్యాయమే గెలుస్తుందన్నారు. జగన్ వ్యవహారాలను మౌనంగా భరిస్తూ వచ్చిన వైసీపీ నాయకులు పెదవి విరుస్తూ బయటకు వస్తున్నారన్నారు. కేవలం సీట్లు దక్కలేదన్న కారణమే కాదని, ఇన్నాళ్లు ఇలాంటి పార్టీలో ఉన్నందుకు బాధపడుతున్నారన్నారు. చంద్రబాబు చేపట్టిన రా కదలిరా సభలకు వస్తున్న జనం చూస్తుంటే టీడీపీ విజయం ఎప్పుడో ఖరారైందన్నారు. టీడీపీకి 5 కోట్ల ప్రజలే స్టార్ క్యాంపయినర్లు అన్నారు. అవినీతి, అక్రమాల వైసీపీని ప్రజలంతా ఏకమై ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద మాట్లాడుతున్న మహిళలు

పొదుపు సంఘాల సొమ్ము స్వాహాపై ఫిర్యాదు

గాండ్లపెంట, జనవరి 31: మండలంలోని కటారుపల్లి, గొల్లపల్లి గ్రామాల మహిళా సంఘాల బుక్‌కీపర్ రామాంజులు పొదుపుసంఘాల డబ్బు స్వాహా చేశాడని ఆయా సంఘాల మహిళలు మండలకేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ గొల్లపల్లిలో బుక్‌కీపర్‌గా పని చేస్తున్న రామాంజులు 14 సంఘాల శ్రీనిధి సొమ్ము రూ.12లక్షలకు పైగా స్వాహా చేశారని తెలిపారు. ఈ విషయంపై వెలుగు, ఐకేపీ కార్యాలయం నుంచి డబ్బులు చెల్లించాలని, తమ సంఘాలకు నోటీలు వచ్చాయన్నారు. బుక్‌కీపర్ రామాంజులను విచారణ చేసి, తమకు న్యాయం చేయాలని కోరారు. మహిళలు మున్నీ, రమణమ్మ, గంగాదేవి, గంగోజమ్మ, రేహనాతోపాటు దాదాపు వందమంది మహిళలు పాల్గొన్నారు.

తాళిబొట్టు, కమ్మలు లాక్కెళ్లిన దుండగులు

లేపాక్షి, జనవరి 31 : పశువులను మేపడానికి వెళ్లిన మహిళ మెడలో గుర్తుతెలియని దుండగులు కమ్మలు, తాళిబొట్టు లాక్కెళ్లిన సంఘటన బుధవారం మండల పరిధిలోని లక్కేపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వడ్డిపల్లి గ్రామానికి చెందిన పెద్దన్నగారి గంగరాజమ్మ తన పశువులను మేపడానికి లక్కేపల్లి చెరువుకు వెళ్లింది. ఇద్దరు వ్యక్తులు స్కూటీపై వచ్చి ఆమె చెవిలో కమ్మలు, తాళిబొట్టు లాక్కెళ్లారు. పెనుగులాటలో రెండు చెవులు తెగిపోయాయి. బాధితురాలిని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏఆర్ ఏఎస్పీ హనుమంతు బదిలీ

అనంతపురం క్రైం, జనవరి 31 : జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు బదిలీ అయ్యారు. ఈయనను గుంటూరు ఏఆర్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆయన స్థానంలో తిరుపతి ఏఆర్ ఏఎస్పీగా విధుల్లో ఉన్న ఎస్ఎల్ఎన్ రెడ్డిని నియమించారు.

గొర్రెల మందపైకి దూసుకొచ్చిన లారీ

- ఇద్దరు కాపరులు, 20 జీవాల మృతి

డీ.హీరేహాళ్, జనవరి 31: గొర్రెల మందపైకి లారీ దూసుకురావడంతో ఇద్దరు కాపరులు మృత్యువాత పడ్డారు. 20 గొర్రెలు సైతం మృత్యువాత పడిన సంఘటన బుధవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు జాజరకల్లు టోల్ ప్లాజా సమీపంలో కర్ణాటక సండూరు తాలూకా లక్కలపల్లి గ్రామానికి చెందిన కాపరులు మేత కోసం గొర్రెలను తీసుకుని వచ్చారు. మండలం లోని నాగలాపుర గ్రామానికి రాత్రి సమయంలోనే బయలుదేరారు. బళ్లారి - బెంగళూరు హైవే జాజరకల్లు టోల్ ప్లాజా సమీపంలో రోడ్డును దాటుతుండగా బళ్లారి నుంచి బెంగళూరు వైపు వెళుతున్న లారీ గొర్రెల మందపైకి దూసుకొచ్చింది. దీంతో ఆ గొర్రెల మందలో ఉన్న రుద్రప్ప(21), గోపాల్(18)పై కూడా లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రుద్రప్ప అక్కడికక్కడే మరణించగా, తీవ్రంగా గాయపడిన గోపాల్‌ను బళ్లారి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఎస్ఐ రంగడు యాదవ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదంపై వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.



మృతి చెందిన గొర్రెలు

సోలార్, విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం

అనంతపురం, జనవరి31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోలార్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు మంత్రివర్గం నుంచి ఆమోదం లభించింది. ఆ మేరకు బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2950 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ ముందుకొచ్చింది. ఆ కంపెనీ ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సత్యసాయి జిల్లా ముదిగుబ్బ వద్ద 1050 మెగావాట్లు, అనంత జిల్లా కనగానపల్లి, రాప్తాడులలో 1050 మెగావాట్లు, డి. హిరేహాల్, బొమ్మనహాల్‌లలో 850 మెగావాట్ల సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.12,065 కోట్లు పెట్టుబడిని జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ లిమిటెడ్ కంపెనీ పెట్టేందుకు ముందుకొచ్చింది. ఈ సోలార్ ప్లాంట్లు ఏర్పాటు ద్వారా 3300 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు కల్పించనున్నారు. అదే విధంగా సత్యసాయి జిల్లా తలుపుల మండలం పులిగుండ్లపల్లిలో 1000 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు ఆగ్వా గ్రీన్ ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ రూ.4 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకురాగా... మంత్రిమండలి ఆమోదించింది. ప్లాంట్ ఏర్పాటుతో 1000 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగావకాశాలు కలగనున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో 600 మెగావాట్ల విండ్ పవర్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు రెన్యూ విక్రమ్‌శక్తి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ముందుకు రావడంతో పాటు విండ్‌పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు రూ.3600 కోట్లు పెట్టుబడి ఆ సంస్థ పెట్టనుంది. తద్వారా 600 మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయి.

పారిశుధ్య పనులపై కమిషనర్ అసహనం



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

అనంతపురం క్రైం, జనవరి 31: నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులపై నగర కమిషనర్ మేఘస్వరూప్ అసహనం వ్యక్తం చేశారు. కమిషనర్ బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. బిందెల వారి కాలనీలో పారిశుధ్య సమస్యపై సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ప్రాంతాన్ని సర్వే చేసి పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సెంట్రల్ పార్క్ స్థలాన్ని పరిశీలించారు. నగరపాలిక స్థలం ఎంత ఉందని, ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. కంపోస్టుయార్డులో చెత్త నిర్వహణ, అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్‌హెల్త్ ఈఈ సతీష్‌చంద్ర, ఇంజనీర్ సూర్యనారాయణ, టీపీఓ శిరీష, ఇన్‌చార్జ్ ఎంహెచ్ఓ సంగం శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి



మీడియాతో మాట్లాడుతున్న టీఎన్‌టీయూసీ నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 31: అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని పాతూరు బ్రహ్మంగారి ఆలయం వద్ద గురువారం నిర్వహించే చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర బహిరంగ సభను జయప్రదం చేయాలని టీఎన్‌టీయూసీ నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దేవళ్ల మురళీ, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్, అధికార ప్రతినిధి పెద్దమారెప్ప, జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు రఘురామరాజు నేతృత్వంలో చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్ర టెక్కలి నుంచి ఇచ్ఛాపురం వరకు కొనసాగుతుందన్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు అనంతపురం పాతూరులోని బ్రహ్మంగారి ఆలయం వద్ద జరిగే బహిరంగ సభకు టీడీపీ శ్రేణులు, ఉద్యోగ, కార్మిక, భవన నిర్మాణ తదితర కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. నాయకులు పూల బాషా, వన్నూరు, శివాజీ, బాల నాగేంద్ర, ముత్యాలు, రంగనాథ, షేక్షావలి, శ్రీనివాసులు, రాము పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే పట్టాలు దూరం



మహిళలతో సమస్యలు తెలుసుకుంటున్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 31: రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే 40 ఏళ్లుగా మిస్సమ్మ కాలనీలోని ప్రజలకు పట్టాలు దూరమయ్యాయని జనసేన పార్టీ రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత ఆరోపించారు. ఈ మేరకు బుధవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా 30వ డివిజన్ అరవింద్ నగర్‌లోని మిస్సమ్మ కాలనీలో పర్యటించి స్థానికులతో సమస్యలు తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ... 40 ఏళ్లుగా జీవనం సాగిస్తున్న కాలనీ ప్రజలకు ఇళ్ల పట్టాలు అందకపోవడం బాధాకరమన్నారు. కేవలం రాజకీయ నాయకుల ఒత్తిళ్లతోనే ఇక్కడి ప్రజలు భయం భయంగా జీవనం గడపాల్సి వస్తోందన్నారు. 870 కుటుంబాలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వ స్థాపన అనంతరం కాలనీలోని ప్రతిఒక్క నిరుపేదకు ఇళ్ల పట్టాలు మంజూరయ్యేలా చేస్తామని ఆమె హామీ ఇచ్చారు. స్థానిక మహిళలు శ్రీదేవి, నాగేంద్రమ్మ, గంగారత్నమ్మ, 30వ డివిజన్ ఇన్‌చార్జ్ రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న డీడీ కుష్బూకొఠారీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 31: గ్రూప్-2కు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేశారు. బుధవారం స్టడీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... గ్రూప్-2కు ప్రిపేరవుతున్న విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదేవిధంగా ఉచింగా అందించిన స్టడీ మెటీరియల్స్‌ను క్షుణ్ణంగా పరిశీలించి మంచి ఉద్యోగాలు సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. బీసీ స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ రవీంద్ర, అకౌంటెంట్ సుబ్బయ్య, లైబ్రేరియన్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డిజైన్ మేరకే డ్రిప్ పరికరాలు అమర్చాలి

● ఏపీఎంఐపీ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, జనవరి 31: పొలాల్లో నిర్దేశించిన డిజైన్ మేరకే డ్రిప్ పరికరాలు అమర్చాలని ఏపీఎంఐపీ టెక్నికల్ ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం అనంతపురం ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో డ్రిప్ కంపెనీల కో-ఆర్డినేటర్లు, కంపెనీలు, ఏపీఎంఐపీ ఇంజనీర్లకు టెక్నికల్ అంశాలపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ఇప్పటికే డ్రిప్ మంజూరైన రైతులకు తక్షణమే పరికరాలు సరఫరా చేసి పొలాల్లో బిగించాలన్నారు. రైతులు సిబ్బందికి సహకరించాలని కోరారు. అనంతరం డ్రిప్, స్ప్రింక్లర్లు పొలాల్లో బిగించడం, ఇతర అంశాలపై క్షుణ్ణంగా వివరించారు. ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పథకాలను స్తంభింపజేస్తాం

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 31: తమ సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న తోడు, ఆసరా పథకాలను స్తంభింపజేస్తామని సెర్ప్ ఉద్యోగులు హెచ్చరించారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం వారు నిరసన దీక్ష కొనసాగించారు. మానవహారంగా ఏర్పడి ఐక్యతను చాటారు. హామీలను అమలు చేయకుండా సీఎం జగన్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. పేస్కేల్ అమలు చేయాలని, పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని వాకె డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే చలో విజయవాడ నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, నాయకులు శ్రీరాములు, రాజశేఖర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట దీక్షలు చేస్తున్న డీఆర్‌డీఏ-వైకేపీ ఉద్యోగులు

బీసీల ద్రోహి సీఎం జగన్

● టీడీపీ అధికారంలోకి వస్తే బీసీలకు ప్రత్యేక చట్టం

● జయహో బీసీ సదస్సులో నాయకులు



ఐక్యతను చాటుతున్న టీడీపీ నాయకులు

గార్లదిన్నె, జనవరి 31: రాష్ట్రంలోని బీసీలను అన్ని విధాలుగా మోసం చేశారని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ద్రోహిగా నిలిచారని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని కల్లూరు గ్రామంలో బుధవారం టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య అధ్యక్షతన జయహో బీసీ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, గాండ్ల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్, మాజీ జడ్పీటీసీ గాండ్ల విశాలాక్షి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.... రాష్ట్రంలో బీసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎంతో చిత్తశుద్ధితో కృషి చేసిన ఏకైక పార్టీ టీడీపీ అన్నారు. బీసీలకు సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందేలా వారికి అన్ని విధాలా సహకారం అందించిందన్నారు. బీసీలకు చట్ట సభల్లో అత్యధిక ప్రాధాన్యం కల్పించిన ఏకైక పార్టీ అన్నారు. బీసీలకు టీడీపీ హయాంలో ఎన్నో కార్పొరేషన్లు, ఫెడరేషన్ల ద్వారా రాయితీ రుణాలు అందజేసి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ఘనత టీడీపీదేనని అన్నారు. అలాంటి టీడీపీకి బీసీలు వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీలపై దాడులు పెరిగిపోయాయని, వారికి రక్షణ లేకుండా పోయిందని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తే బీసీల రక్షణ కొరకు ప్రత్యేక చట్టాన్ని తెచ్చి వారికి భరోసా కల్పిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో శింగనమల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించి చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసి ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీసీ కుటుంబాలన్నీ సిద్ధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కుంట రమణ, వడ్డెర సంఘం అధ్యక్షుడు వెంకట్, అనంతపురం అర్బన్ బీసీసెల్ అధ్యక్షుడు సిమెంట్ పోలన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజి, వడ్డెర సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు వన్నూర్, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు ఆదినారాయణ, బండిపరశురాం, గేటుక్రిష్ణారెడ్డి, బ్యాళ్ల నాగేంద్ర, గుత్తాబాలకృష్ణ, గుర్రం శీనా, జయరాం, జగదీష్, బాబయ్య, ఆంజి, ఆవుల శీనా, శేఖర్, మాజీ సర్పంచులు సుంకన్న, పుల్లన్న, చితంబరప్ప, నరసింహారెడ్డి, గుత్తా లక్ష్మీనారాయణ, కొడిదల రామకృష్ణ, శీనా పాల్గొన్నారు.

ఉచిత న్యాయసేవలు వినియోగించుకోండి

● న్యాయాధికారి కె.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, జనవరి 31: న్యాయసేవాధికార చట్టం కింద ప్రజాప్రయోజన సేవల కేసుల్లో ఉచిత న్యాయసేవలు వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రజా ప్రయోజనాల శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్, న్యాయాధికారి కె.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం న్యాయసేవాసదన్‌లో వివిధ ప్రజాప్రయోజన సేవ శాఖల ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్‌అదాలత్‌లో ప్రజాప్రయోజనకేసుల పరిష్కారంపై నిర్వహించిన అవగాహన సదస్సులో న్యాయాధికారి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రజాప్రయోజన సేవల కేసుల్లో ప్రజాప్రయోజన శాశ్వత లోక్ అదాలత్ తప్పనిసరిగా పరిష్కారం అందిస్తుందన్నారు. ఇరుపక్షాల నడుమ సామరస్య పరిష్కారానికి సమాన అవకాశాలు ఇస్తూ రాజీ కుదరని పక్షంలో ధర్మాసనం తీర్పు వెలువరిస్తుందన్నారు. శాశ్వత లోక్‌అదాలత్‌లో ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి కోర్టు రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రూ.కోటి పరిహారం వరకు వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం కలిగి ఉందన్నారు. శాశ్వత లోక్‌అదాలత్ సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, న్యాయవాదులు, మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్, పోస్టల్, హౌసింగ్, డ్వామా, రోడ్లు భవనాలు, ఎల్ఐసీ, ప్రభుత్వాసుపత్రి, విద్యాశాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జనవరి 31: పోలీస్ డైరీ-2024ను ఎస్పీ అన్బురాజన్ బుధవారం ఆవిష్కరించారు. పోలీసులకు సంబంధించి సమగ్ర సమాచారం కలిగి ఉన్న ఈ డైరీ రోజువారీ దైనందిన కార్యకలాపాలలో పోలీస్ సిబ్బందికి ఎంతో ఉపయోగపడుతుందని, పోలీస్ డైరీ తయారీకి కృషి చేసిన అందరికీ ఎస్పీ అభినందనలు తెలిపారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, శివప్రసాద్, వెంకటరమణ, సరోజ పాల్గొన్నారు.

కొనసాగిన ప్రజాభిప్రాయసేకరణ



కార్యక్రమంలో పాల్గొన విద్యుత్ అధికారులు

అనంతపురంరూరల్, జనవరి 31: విద్యుత్ చార్జీల పెంపుపై స్థానిక జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్‌శాఖ సిటిజన్ ఫోరంకు చెందిన సభ్యులు ఇందులో పాల్గొని తమ అభిప్రాయాలను ఏపీఈఆర్‌సీ సభ్యులకు వివరించారు. అనంతపురం టౌన్ డివిజన్ ఈఈ జేవీ రమేష్, టెక్నికల్ ఏఈఈ భానుప్రకాష్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇంటి స్థలాలు : కలెక్టర్

అనంతపురం టౌన్ జనవరి 31: ప్రభుత్వ మార్గదర్శకాల మేరకే అర్హత ఉన్న జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని కలెక్టరు గౌతమి వెల్లడించారు. కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో జర్నలిస్టుల హౌసింగ్ స్కీమ్‌పై జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జేసీ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయిత్రీదేవిలతో కలిసి కలెక్టరు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీఓ535లో ఉన్న అన్ని నిబంధనలను పాటించి అర్హత ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఐదేళ్ల అక్రిడిటేషన్ అనుభవం ఉన్నవారితో పాటు సమాచారశాఖ కమిషనర్ పంపిన ప్రాథమిక జాబితాను పరిశీలించిన అనంతరం తుది అర్హుల జాబితా ప్రకారం ఇంటిస్థలాలు కేటాయిస్తామన్నారు. 335 దరఖాస్తులు వచ్చాయని, వీటిని సంబంధిత మండలాల తహసీల్దార్లకు పంపి పరిశీలిస్తామని, అర్హులుగా తేలినవారికి ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. అవసరమైన స్థలాలను సేకరించాలని ఆర్డీఓలకు కలెక్టరు ఆదేశించారు. మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఐదేళ్ల అక్రిడిటేషన్ ఉండి ఏదైనకారణంతో ఈ ఏడాది అక్రిడిటేషన్ రాకపోతే వారిని పరిగణనలోకి తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఆత్మీయ కలయికను విజయవంతం చేయండి

రాప్తాడు, జనవరి 31: మాదిగలపై జరుగుతున్న దాడులను, అన్యాయాలను ఎదుర్కొనేందుకు ఫిబ్రవరి 11న అనంతపురం నగరంలోని లలితకళాపరిషత్‌లో నిర్వహించే మాదిగల ఆత్మీయ కలయికను విజయవంతం చేయాలని ఆ సంఘాల నాయకులు కోరారు. బుధవారం రాప్తాడు మండలం మరూరులో ఆత్మీయ కలయిక పోస్టర్లు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మాదిగలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువ అయ్యాయన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మాదిగల జీవనాలు మెరుగుపడలేదన్నారు. నాయకులు సాకే హరి, సుదర్శన్, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులడ పాలచెర్ల ముత్యాలు, నరేష్, వంశీకృష్ణ, శ్రీకాంత్, కార్తీక్ పాల్గొన్నారు.

నేడు రెండు పోస్టులకు ఇంటర్వ్యూలు

అనంతపురం విద్య, జనవరి 31: జిల్లా ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో ఖాళీగా ఉన్న రెండు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి పీడీ శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ సమితిలో ఖాళీగా ఉన్న సోషల్ వర్కర్ (మహిళ) పోస్టుకు, శిశుగృహలో పార్ట్ టైం డాక్టర్ పోస్టుకు కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. నేడు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 11గంటలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

అనంతపురం క్రైం, జనవరి 31: మున్సిపల్ కార్మికులందరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు జిల్లా కలెక్టర్ గౌతమిని కలిసి వినతిపత్రం అందజేసింది. సోమవారం అనంతపురం ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగభూషణం, ఏటీఎం నాగరాజు కలిసి కలెక్టర్‌కు విన్నవించారు. గతంలో ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో ఆయన సమక్షంలో కలెక్టర్‌ను కలిశారు. ఉప్పరపల్లి పొలంలో రాళ్ల గుట్టల ప్రాంతాన్ని శుభ్రం చేసుకున్నామని వివరించారు. కలెక్టర్, ఎమ్మెల్యే స్పందిస్తూ కార్మికులకు న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.

పంచాయతీ రాజ్ ఎస్ఈగా ఈరాస్వామి నియామకం

అనంతపురం, సీటీ, జనవరి 31: జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈగా ఈరస్వామి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఈ భాగ్యరాజ్ బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో కర్నూలు జిల్లాకు చెందిన ఈరాస్వామిని పంచాయతీరాజ్ ఎస్ఈగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన త్వరలో పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

అడ్మిషన్‌లకు కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, జనవరి 31: ప్రభుత్వంచే గుర్తింపు పొందిన నర్సింగ్ కళాశాలలో జీఎన్ఎం కోర్సులలో చేరే విద్యార్థులకు 2, 3వ తేదీలలో రెండురోజుల పాటు కౌన్సిల్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ తేదీన సైన్స్ గ్రూపులలో ఉత్తీర్ణులైన రెగ్యులర్ విద్యార్థులు, 3న మిగిలిన సైన్స్ కంపార్ట్‌మెంట్, ఆర్ట్ రెగ్యులర్, కంపార్ట్‌మెంట్ అభ్యర్థులు ఆయా తేదీల్లో ఉదయం 10 గంటలకు జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి అభ్యర్థులు చేరుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ... డ్రైవర్ మృతి

ధర్మవరంరూరల్, జనవరి 31: కనగానపల్లి మండలం దాదులూరు కొట్టాల వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డుప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంగళూరుకు చెందిన రవిచంద్రన్(48) అనే డ్రైవర్ లారీతో బెంగళూరు నుంచి అనంతపురం వైపు వస్తున్నాడు. మార్గమధ్యలోని దాదులూరు కొట్టాల వద్దకు రాగానే జాతీయరహదారి పక్కన ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో లారీ గుంతలోకి దూసుకెళ్లింది. భయపడిన లారీ డ్రైవర్ కిందకు దూకాడు. తీవ్రగాయాలతో బయటపడ్డ అతన్ని స్థానికులు, హైవే సిబ్బంది సాయంతో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే రవిచంద్రన్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డ్రైనేజీలో మగ్గుతున్న ఆ కాలనీలు కనబడలేదా..?

● ఎమ్మెల్యేపై టీసీ వరుణ్ ఫైర్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 31: దశాబ్దకాలానికిపైగా డ్రైనేజీలో మగ్గుతున్న 2వ డివిజన్‌లోని కల్పనాజోష్, భాగ్యనగర్, బిందెల కాలనీలు మీకు కనబడలేదా అని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఎమ్మెల్యే అనంత వెంకరామిరెడ్డి, మేయర్, మున్సిపల్ అధికారులపై ఫైర్ అయ్యారు. బుధవారం టీసీ వరుణ్ ఆ పార్టీ సీనియర్ నాయకుడు కాయగూరల లక్ష్మీపతి, నాయకులు, కార్యకర్తలతో కలిసి 2వ డివిజన్‌లోని డ్రైనేజీ సమస్యపై జిల్లా కలెక్టర్‌ను కలిశారు. సత్వరమే చర్యలు తీసుకొని కాలనీల మధ్యనున్న డ్రైనేజీని తరలించాలని వినతి పత్రం అందేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ... పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా అనంత నగరాభివృద్ధి తయారైందన్నారు. నగరంలో రూ.800 కోట్లతో అభివృద్ధి చేశానని చెబుతున్న ఎమ్మెల్యే ఎక్కడ చేశారో చూపాలని డిమాండ్ చేశారు. మీరు చేసిన అభివృద్ధి ఏంటో కల్పనాజోష్, భాగ్యనగర్, బిందెలకాలనీల్లోని డ్రైనేజీ మడుగును చూస్తుంటేనే అర్థమవుతోందని ఎద్దేవా చేశారు. 50 డివిజన్లలో కార్పొరేటర్లను గెలిపిస్తే... వారు సమస్యల పరిష్కారంపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే, మేయర్, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి సమస్యను ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఎన్నిసార్లు చెప్పినా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని కాలనీలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ప్రధానకార్యదర్శి కుమ్మర నాగేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు జయరాంరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాపా ధనుంజయ, సంజీవరాయుడు, ఇండ్ల కిరణ్‌కుమార్, సిద్దూ, జయమ్మ, అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, సదానందం, గ్రంధి దివాకర్, జక్కిరెడ్డి ఆదినారాయణ, మేదర వెంకటేష్ హుస్సేన్, దరాజ్ బాష, లాల్ స్వామి పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోని కాలనీవాసులతో కలిసి మాట్లాడుతున్న జనసేన నాయకులు

టీడీపీని అధికారంలోకి తెచ్చుకోవాలి

● మాజీ మంత్రి పరిటాల సునీత



రాచనపల్లి నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, జనవరి 31: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చుకునే విధంగా అందరూ పనిచేయాలని మాజీ మంత్రి పరిటాల సునీత టీడీపీ శ్రేణులకు సూచించారు. బుధవారం మండలంలోని రాచానపల్లి పంచాయతీ పరిధిలోని నాయకులతో ఆమె తన క్యాంపు కార్యాలయంలో పార్టీ కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. గురువారం నుంచి ప్రతి రోజు కార్యక్రమాలు నిర్వహించేవిధంగా చూడాలన్నారు. 1న రాచానపల్లి, బీఎన్ఆర్‌కాలనీ, ఎస్సీ కాలనీ, దోబీకాలనీ, పరిటాల రవీంద్ర కాలనీల్లో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహించాలన్నారు. 2న ఆర్ఎన్ఆర్ కాలనీ, రామకృష్ణాపురం, సిండికేట్‌నగర్, 5,6 తేదీల్లో సిండికేట్ నగర్‌లో వరుసగా భవిష్యత్తుగ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 3న ఉదయం ఆత్మకూరు, మధ్యాహ్నం రాప్తాడు మండలంలో జయహో బీసీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 4న ఉదయం చెన్నేకొత్తపల్లి, మధ్యాహ్నం రూరల్ పరిధిలో ఉంటుందన్నారు. ఎన్నికలకు ఎంతో సమయం లేదని, మనం దూకుడుగా వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపేలక్ష్యంగా పనిచేయాలన్నారు. చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. రాప్తాడులో టీడీపీ జెండా ఎగరాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాములాయి రఘు పాల్గొన్నారు.

సేవాఘడ్‌కు ఆర్టీసీ బస్సులు నడపాలి



ఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీఎస్ఎస్ నాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 31: బంజారాల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జన్మస్థలం సేవాఘడ్‌కు అనంతపురం నుంచి బస్సు సర్వీసులు నడపాలని అఖిల భారత బంజారా సేవాసంఘం(ఏబీఎస్ఎస్) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోనిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీ నాయక్ మాట్లాడుతూ... సేవాఘడ్‌లో సేవాలాల్ మహరాజ్, మాతా జగదాంబ అమ్మవార్ల ఆలయాలున్నాయని, ఇదే ప్రాంతంలో గిరిజన విద్యాసంస్థలు కూడా ఉన్నందున ప్రజలు, భక్తుల రాకపోకలు నిత్యం జరుగుతుంటాయన్నారు. అనంతపురం నుంచి గుత్తి, గుంతకల్లు మీదుగా వెళ్లే ఆర్టీసీ బస్సులను సేవాఘడ్ మీదుగా నడపాలని కోరారు. దీనికి ఆర్ఎం స్పందిస్తూ ప్రస్తుతానికి సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సర్వీసులు నడుపుతామని హామీ ఇచ్చారు. జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సుగుణబాయి, ప్రధాన కార్యదర్శ శివమ్మ, కోశాధికారి పరమేష్‌నాయక్, ఉపాధ్యక్షుడు శంకర్‌నాయక్, సహాయ కార్యదర్శి ఈశ్వరిబాయి, బన్సిలాల్, గోవిందునాయక్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఈఈకి సత్కారం



ఈఈ సుధాకర్‌బాబు దంపతులను సత్కరిస్తున్న అధికారులు

అనంతపురంరూరల్, జనవరి 31: విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్‌బాబును పలువురు అధికారులు, ఉద్యోగులు సత్కరించారు. బుధవారం ఆయన పదవీ విరమణ కార్యక్రమాన్ని జేఎన్‌టీయూరోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయం మీటింగ్ హాల్‌లో నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఏపీఎస్‌డీసీఎల్, ట్రాన్స్‌కోలోని అధికారులు హాజరయ్యారు. ట్రాన్స్‌కో ఎస్ఈ మురళీకృష్ణ, డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుధాకర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్ తదితరులు శాఖలో ఆయన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో ఏఈఈ శ్రీప్రసాద్, మహబూబ్‌భాష, జేఈ సాయి మనోజ్‌తోపాటు కడప, కర్నూల్‌లో అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ గోడౌన్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

అనంతపురం టౌన్, జనవరి 31: జిల్లాలో ఎఫ్‌సీఐ గోడౌన్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ తొలిదశలో 102 గోడౌన్లు మంజూరుకాగా ఇప్పటికి 24 నిర్మాణాలు మాత్రమే పూర్తి చేశారన్నారు. నెల రోజుల్లో మరో 30 గోడౌన్ల నిర్మాణాలు పూర్తి చేయాలని మార్చి నెలాఖరికి మొత్తం పూర్తి కావాలన్నారు. పూర్తియిన వాటిని వ్యవసాయ సహకార సంఘాలకు అప్పగించాలని సూచించారు. వ్యవసాయశాఖ జేడీ ఉమాశంకరమ్మ, డీపీఓ ప్రభాకరరావు, మార్కెటింగ్ ఏడీ చౌదరి, ఏడీసీసీ బ్యాంకు సీఈఓ రాంప్రసాద్, నాబార్డ్ డీడీ ఎం.అనూరాధ పాల్గొన్నారు.

డ్రిప్ సరఫరాలో అనంతకు మొదటి స్థానం

అనంతపురం అర్బన్, జనవరి 31: రాష్ట్ర వ్యాప్తంగా డ్రిప్ పరికరాల మంజూరు, సరఫరాలో అనంత జిల్లాకు మొదటి స్థానం దక్కినట్లు ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జిల్లాలోని 12500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేయాలని లక్ష్యం విధించారన్నారు. ఇప్పటి దాకా 9577 మంది రైతులకు 11706 హెక్టార్లలో పరికరాలు సరఫరా చేసి రాష్ట్రంలో మొదటి స్థానాన్ని పొందామన్నారు.

ఎన్నికల్లో ఘర్షణలకు దిగితే చర్యలు

శింగనమల, జనవరి 31: ఎన్నికల సమయంలో గ్రామల్లో గొడవలు, ఘర్షలు దిగితే చర్యలు తప్పవని ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్సీకాలనీలో ఎన్నికలపై కాలనీవాసులకు ఎస్ఐ అవగాహన కల్పించారు. అయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కువగా యువత ఎన్నికల సమయంలో గొడవలు చేసే అవకాశలు ఉన్నాయని, యువత జాగరూకతతో వ్యవహరించి గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏఎస్ఐ చితంబరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

అనంతపురంరూరల్, జనవరి 31: మండలంలోని రాచానపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. అనంతపురం డివిజన్ ఏడీ రవి, ఎమ్మెల్యే, ఏఓ సాయి లక్ష్మి, ఏఈఓ మురళీ, ఎంపీపీ వరలక్ష్మి, జడ్పీటీసీ చంద్రకుమార్ పాల్గొన్నారు.

పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలి

శింగనమల, జనవరి 31: ఖరీఫ్ సీజన్‌లో తీసుకున్న రుణాలకు రీషెడ్యూల్ చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు తరిమెల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని తరిమెల గ్రామీణ బ్యాంకు మేనేజర్ మురళీకి రైతుల రుణాలను రీషెడ్యూలు చేసి కొత్త రుణాలు ఇవ్వాలని నాయకులు వినతి పత్రం అందజేశారు. నాయకులు భాస్కర్, రామాంజనేయులు, సుంకన్న పాల్గొన్నారు.

3న టెంకాయల విక్రయ వేలం

గార్లదిన్నె, జనవరి 31: మండలంలోని కోటంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద టెంకాయలు విక్రయించుకునేందుకు కోటంక గ్రామంలో యల్లమ్మ కట్ట వద్ద 3వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ బాబు తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9849135165 నెంబరును సంప్రదించాలన్నారు.

'దుర్గం' మున్సిపల్ సమావేశంలో వాగ్వాదం

మున్సిపల్ చైర్‌పర్సన్.. ఎమ్మెల్యే కాపు మధ్య మాటల యుద్ధం

రాయదుర్గంటౌన్, జనవరి 31: పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశం రసాభాసగా సాగింది. సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. రాయదుర్గం పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో జరగకపోవడంపై ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. మున్సిపల్ పాలకవర్గంలో రెండు వర్గాలు ఉండటంతో అభివృద్ధి కుంటుపడిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పేర్కొన్నారు. అభివృద్ధి చేయడం చేతకాక వర్గ పోరు ఉందని విమర్శించడం సరికాదని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఆమెపై మండిపడ్డారు. ఐదేళ్ల పాలనలో రాయదుర్గం నియోజకవర్గంలో తాగునీరు, కరోనా సమయంలో సొంతనిధులతో ప్రజలకు అండగా నిల్చామని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. వర్గపోరుకు తావు లేకుండా అందరినీ సమానంగా ఆదరించి అభివృద్ధికి కృషి చేశామన్నారు. సొంతనిధులతో పురపాలక సంఘం పరిధిలో సమస్యలను పరిష్కరించామన్నారు. జగనన్న ఇచ్చిన డబ్బులతో అభివృద్ధి పనులు చేసి సొంత నిధులతో అభివృద్ధి చేసినట్లు వ్యాఖ్యలు చేయడం సరికాదని


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

ఎమ్మెల్యేపై మున్సిపల్ చైర్‌పర్సన్ మండిపడ్డారు. తాను మాట్లాడేటపుడు అడ్డు రావదని ఆమెపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలు చూపిస్తూ మాట్లాడవద్దని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిపై మున్సిపల్ చైర్‌పర్సన్ ఆగ్రహంతో ఊగిపోయారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధికి నిధులు కేటాయించింది జగనన్న కాదు అని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని గుర్తించాలని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు: కౌన్సిలర్లు

గుత్తి, జనవరి 31: వార్డుల్లో సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలను ఎందుకు నిర్వహిస్తున్నారని అధికార పార్టీ కౌన్సిలర్లు అధికారులపై మండిపడ్డారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాను చదువుతుండగానే పలువురు కౌన్సిలర్లు వార్డులలో అభివృద్ధి పనులు చేయకపోవడంతో తాము ప్రజలకు ముఖం చూపించలేకపోతున్నామని అధికారులపై ధ్వజమెత్తారు. ప్రతి సమావేశంలో తమ వార్డులో నెలకొన్న


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

తాగునీటి సమస్య పరిష్కరించాలని మొర పెట్టుకున్న ఎందుకు పట్టించుకోవడంలేదంటూ 5వ వార్డు కౌన్సిలర్ ఖాజాఖాన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లు కాలిపోయి మూడు నెలలు అవుతున్న ఎందుకు మరమ్మతులు చేయడం లేదంటూ కౌన్సిలర్ వరద అధికారులను ప్రశ్నించారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా వార్డులలో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసి పరిష్కరించే విధంగా చూడాలని కౌన్సిలర్ నజీర్ అధికారులను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే కేశవ్


మహిళలతో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

ఉరవకొండ, జనవరి 31: చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని వై.రాంపురం గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు మునుపు గ్రామంలోని ఎర్రితాతస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ లేదు


ఎదురూరు గ్రామంలో సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న వెంకటశివుడుయాదవ్

పామిడి, జనవరి 31: వైసీపీ పాలనలో బీసీలకు రక్షణ లేదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. మండలంలోని ఎదురూరు, అక్కజాంపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన టీడీపీ, జనసేన నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, దోపిడీలకు పాల్పడుతోందని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బండారు ఆనంద్, మారుతి వరప్రసాద్ రెడ్డి, విజయభాస్కర్ నాయుడు, సూర్యనారాయణ, నాగేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి, శివ, గోపాల్, సాలప్ప, జయరాం, సుంకప్ప, నెట్టికల్లు, రంగప్ప, రామాంజనేయులు, అజయ్, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళలకు భవిష్యత్తు: డాక్టర్స్‌సెల్


మహిళలకు సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పత్తి హిమబిందు

పామిడి, జనవరి 31: తెలుగుదేశం పార్టీతోనే మహిళల భవిష్యత్తు గ్యారెంటీ అని టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు పేర్కొన్నారు. మండలంలోని పీ కొండాపురం గ్రామంలో బుధవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్తుకు తెలుగుదేశంపార్టీతోనే గ్యారెంటీ ఉందన్నారు. 2024 ఎన్నికల్లో నారా చంద్రబాబునాయుడు సీఎం అయితేనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి దిశగా దూసుకువెళ్తుందన్నారు. టీడీపీలో మహిళలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. అందుకే మహిళలను లక్షాధికారులను చేసేందుకు ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, తిరుపాలు, సుధాకర్‌బాబు, గోవిందరాజులు, రామయ్య, నారాయణ, కదిరప్ప, మనోహర్, ఉమానాయక్, రాధా, జానకి, అరుణ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు బాబు ఘనతే


పెరుమాళ్ల జీవానందరెడ్డి

పామిడి, జనవరి 31: తెలుగుదేశంపార్టీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని ఆ పార్టీ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెనుకొండలో కియ పరిశ్రమను ఏర్పాటు చేయించి, వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత చంద్రబాబుదేనన్నారు. చంద్రబాబునాయుడు సహకారంతో గజరాంపల్లి గ్రామంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు సొంత నిధులతో వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమను స్థాపించామన్నారు. ఈ గార్మెంట్స్‌లో సుమారు 5వేల మంది మహిళలు, యువతులకు స్టైఫండ్ అందజేస్తూ ఉచితంగా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. త్వరలోనే చంద్రబాబు చేతుల మీదుగా దీన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో రైతులకు ఉపయోగకరమైన పనిముట్ల సేకరణ తయారీ కేంద్రాలు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్స్ ప్రాసెసింగ్ యూనిట్స్, సోలార్ పవర్ జనరేషన్ యూనిట్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

అటవీ భూముల్లో అక్రమాలను నిరూపిస్తాం

ఉరవకొండ, జనవరి 31: వజ్రకరూరు మండలంలోని వెంకటాంపల్లి, పందికుంట గ్రామాల్లో అటవీ భూముల్లో జరిగిన అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తామని చర్చకు సిద్ధమా..? అని వైసీపీ నాయకులకు మాజీ జడ్పీటీసీ తులసీదాస్ నాయక్, టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో వారు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అటవీ భూములను సాగు చేస్తున్న వారిని గుర్తించి పారదర్శకంగా అర్హులకు సాగు పత్రాలు ఇవ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో అభివద్ధి చేసిన చెట్లను నరకడం ఎంతవరకూ సమంజసమన్నారు. గతంలో అటవీ భూమిని సాగు చేస్తున్న వారిని గుర్తించి, ప్రభుత్వ నిబంధనలను అనుసరించి 100మందికి పైగా లబ్ధిదారులకు న్యాయం చేశామన్నారు. 2017-18 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలో ఎల్‌పీఎస్ స్కీంను ఎస్టీల కోసం తీసుకు వచ్చారన్నారు. సమావేశంలో వాల్యనాయక్, వెంకటేష్ నాయక్, జయరాంనాయక్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ దుకాణాల్లో తనిఖీలు

గుత్తి, జనవరి 31: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని దుకాణాలపై లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మూడు, ఐదు షాపులను తనిఖీలు చేశారు. షాపులలోని నీళ్ల బాటిళ్ల, శీతల పానీయాలపై ఉన్న ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ రెండు దుకాణాలపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అసత్య వార్తలు రాయించడం తగదు


టీడీపీలోనే ఉంటామని చెబుతున్న జబీవుల్లా, రసూల్

గుంతకల్లు, జనవరి31: ముస్లిం మైనార్టీ యువకులను బలవంతంగా టీడీపీలో చేర్పించారంటూ వైసీపీ పట్టణ కన్వీనరు సుంకప్ప పత్రికల్లో రాయించడం తగదని టీడీపీ నాయకులు టీ కేశప్ప, టీ సురేంద్ర పేర్కొన్నారు. గత ఆదివారం పట్టణంలోని 5, 6 వార్డుల్లో దాదాపు 110 మంది యువకులు మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు సమక్షంలో టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. అయితే వారిలో రసూల్, జబీవుల్లా అనే ఇద్దరు ముస్లిం మైనార్టీ యువకులను పని ఉంది రమ్మని తన కార్యాలయం వద్దకు పిలిపించి వారిపై ఒత్తిడి తెచ్చి ఆ ఇద్దరూ వైసీపీలోనే ఉన్నారంటూ అనుకూల పత్రికలో సుకంప్ప వార్తలు రాయించారంటూ ఆరోపించారు. ఎవరికి ఇష్టమొచ్చిన పార్టీలు వారు ఉంటారని అనవసరంగా రసూల్, జబీవుల్లాను ఇబ్బంది పెట్టడం మానుకోవాలని హితవు పలికారు.

వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే: టీడీపీ


మాట్లాడుతున్న టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఇంటిగ్రేటెడ్ ట్రైనర్ ఎం ఆదినారాయణ

పామిడి, జనవరి 31: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమేనని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఇంటిగ్రేటెడ్ ట్రైనర్ ఎం ఆదినారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని ఎద్దులపల్లి రోడ్డులో గల తెలుగు రైతు జిల్లా అధ్యక్షులు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి స్వగృహంలో బుధవారం యూనిట్, క్లస్టర్, పోలింగ్ బూత్ ఇన్‌చార్జులకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే రెండు నెలలపాటు క్షేత్రస్థాయిలో టీడీపీ బలోపేతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రజల మదిలో నిలిచిపోయేలా అవగాహన కల్పించాలన్నారు. సూపర్ సిక్స్ పథకాలు తెలుగుదేశం పార్టీకి ఆరోప్రాణమన్నారు. పార్టీ అభివృద్ధికి శ్రమించిన కార్యకర్తలకు టీడీపీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, గౌస్‌పీరా, చెన్నవరం మహబూబ్‌బాషా, అప్పన్నగారి కుమార్, రామకృష్ణ, వడ్డే శివకుమార్, బొమ్మా మోహన్‌కృష్ణ, గాదిలింగ, శ్రీనివాసులు, చీమల రాము, శివ, బాబా, తాజ్, మాధవ, దూదూ, సాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేటీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

రాయదుర్గంరూరల్, జనవరి 31: విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి పేర్కొన్నారు. మండలంలోని బీఎన్‌హళ్లి గ్రామంలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శిబిరం ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విభాగ అధికారి నాగప్ప ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రఘురామమూర్తి, సర్పంచ్ చంద్రకళ అతిథులుగా పాల్గొన్నారు. మాజీ ఎంపీటీసీ రామాంజనేయులు మాట్లాడుతూ వలంటీర్లు తమ గ్రామంలో ఏడురోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డీ నారాయణ, ఎం రామకృష్ణ, అధ్యాపకులు రవికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే..


కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

యాడికి, జనవరి 31: మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు టీడీపీ నాయకుడు, క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి తెలిపారు. చవ్వా ఆదినారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం ఐదు ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు శిక్షణా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. యాడికిలోని వెంగమనాయుడుకాలనీ, నారాయణస్వామికాలనీ, రాఘవేంద్రకాలనీ, పాతపోలీస్‌స్టేషన్‌వీధి, మార్కెట్‌వీధుల్లో ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాల్లో 500మంది శిక్షణ పొందనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, రామకృష్ణ, లక్ష్మణ్, మౌలాలి, రజాక్, నరసింహులు, పురుషోత్తం ఆచారి, రంగస్వామి, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

'మెట్టు' ఏమి చేశాడో చెప్పి ఓటు అడగాలి

బొమ్మనహాళ్, జనవరి 31: ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి తన 20 ఏళ్ల రాజకీయ జీవితంలో రాయదుర్గం నియోజకవర్గానికి ఏమి చేశాడో చెప్పిన తర్వాతే ప్రజలను ఓట్లు అడగాలని టీడీపీ బీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెట్టు గోవిందరెడ్డి గతంలో ఐదేళ్ల పాటు ఎమ్మెల్యేగా, ఆరు సంవత్సరాలు ఎమ్మెల్సీగా ఉండి చట్టసభల్లో ఏ ఒక్కరోజు కూడా ప్రజాసమస్యలపై మాట్లాడలేదన్నారు. గోవిందరెడ్డిని ఎన్నుకుంటే రాయదుర్గం నియోజకవర్గ అభివృద్ధి 25 సంవత్సరాలకు వెనక్కి వెళుతుందని కేశప్ప అన్నారు. రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాలవ శ్రీనివాసులుతోనే సాధ్యమని పేర్కొన్నారు. కాలవ శ్రీనివాసులు 2019లోనూ గెలిచి ఉంటే ఉంతకల్లు వద్ద రిజర్వాయర్ ఒక మహర్దశకు వచ్చేదని తెలిపారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రెటరీ నాగరాజు, మహ్మద్ రఫీ, మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్మాస్‌వలి పాల్గొన్నారు.

విజయనగర్‌కాలనీలో జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటన


జేసీ అశ్మిత్‌రెడ్డికి తండా వాసులు వేసిన నిలువెత్తు దండ

తాడిపత్రి, జనవరి31: పట్టణంలోని విజయనగర్ కాలనీలో టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం పర్యటించారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బుడగజంగాల కాలనీలో తండా వాసులు వారి సంప్రదాయాలతో కూడిన నిలువెత్తు దండను వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయన వెంట టీడీపీ కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున, షెక్షావలి, రేష్మాపర్వీన్ ఉన్నారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

యాడికి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చందన గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, స్పోక్స్‌పర్సన్ కులశేఖర్‌నాయుడు, టీడీపీ నాయకులు రామాంజనేయులు, సూర్యనారాయణరెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, భాస్కర్, ధనుంజయ, రామకృష్ణ, అశోక్‌రెడ్డి ఉన్నారు.

గుంతకల్లులో టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణ

గుంతకల్లుటౌన్, జనవరి31: పట్టణంలోని జితేంద్రగౌడ్ క్యాంపు కార్యాలయంలో బుధవారం పట్టణం, మండల క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ కార్యక్రమం ట్రైనర్స్ వాల్మీకి ప్రతాప్‌నాయుడు, స్వప్న మాట్లాడుతూ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం, సూపర్ సిక్స్ పథకాలు, రిజిస్ట్రేషన్, ఓటర్ వెరిఫికేషన్, గత ఎన్నికల తప్పిదాలు, వచ్చే ఎన్నికల్లో పోలింగ్ శాతం ఎలా పెంచుకోవాలి వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనర్స్ లీలాస్వామి, కురుబసురేష్, పులికొండయాదవ్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు

శివాజీ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

తాడిపత్రిటౌన్, జనవరి31: పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయ సమీపంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బుధవారం శివాజీ మహరాజ్ విగ్రహ కమిటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్ రవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సాయిచరణ్‌రావు, గంగాధర్‌రావు, మహేంద్రకర్, గంగాధర్, రామచంద్ర, ఆంజనేయులు, చెన్నా రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఉంటేనే విజయం: కేసీ హరి

గుంతకల్లు, జనవరి 31: విజన్ ఉంటేనే విజయం సాధ్యమవుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు, ఎస్ఎస్‌జీఎస్ కళాశాల కరస్పాండెంటు కేసీ హరి పేర్కొన్నారు. కళాశాల 40వ వార్షికోత్సవాన్ని బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బళ్లారి చైతన్య గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ పయ్యావుల రాధాకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని, లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో కృషిచేయాలన్నారు. విద్యలో రాణిస్తూనే నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చి వ్యక్తిత్వ వికాసాన్ని సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, ర్యాంప్ వాక్‌లు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో శంకరానందగిరి స్వామి ఎడుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ ఏ రంగయ్య, ట్రెజరర్ బీ అశ్వత్థమ్మ, కార్యనిర్వాహక సభ్యులు కే రామకృష్ణ నాయుడు, డీఏ మురళీ కృష్ణ, ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీ గోపాల్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బ్రహ్మానంద



కళాశాల వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న కేసీ హరి

రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు సురేశ్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, బసెట్టి క్రిష్ణయ్య, టీ వెంకట రమణ, గోపి, సురేశ్‌బాబు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే చర్యలు

బెళుగుప్ప, జనవరి 31: ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ప్రజావేదికలో క్షేత్రస్థాయి సిబ్బందిపై జిల్లా అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన బుధవారం బుధవారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ పథకం కింద చేసిన పనులకు రికార్డులు లేకపోవడం, బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో పాటు వాగులు, వంకలు చెరువులలో పనులు చేసి నిధులు దుర్వినియోగమైనట్లు తనిఖీలలో వెలుగుచూడటంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2022-23 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద రూ. 7.44 కోట్లతో 1386 పనులు చేపట్టగా దీనిపై ప్రజావేదిక నిర్వహించి రికవరీకి ఆదేశించారు. కాగా గతానికి భిన్నంగా


ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి

కూలీలు, ప్రజలు లేకుండానే జిల్లా అధికారులు, తనిఖీ బృందాలు, ఉపాధి సిబ్బందితోనే ప్రజావేదికను నిర్వహించడం గమనార్హం. కార్యక్రమంలో డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, అడిషనల్ పీడీ సుధాకర్ రెడ్డి, డీవీవో రమణారెడ్డి, విజిలెన్స్ సెల్ అధికారి పరమేష్, ఎస్ఆర్‌పీ లోకేష్, ఏపీవో భాగ్యలక్ష్మీ, వైసీపీ నాయకులు శ్రీనివాసులు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఉపాధి పనుల్లో పలు అక్రమాలు జరిగినట్లు తనిఖీల్లో తేలడంతో సిబ్బంది నుంచి రూ. 67 వేలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. ఈ మొత్తాన్ని చెల్లించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్ట్రాంగ్ రూముల పరిశీలన

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 31: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూములను జిల్లా కలెక్టర్ గౌతమి బుధవారం పరిశీలించారు. నార్త్ ఉన్నత పాఠశాల, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జాతీయ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సిబ్బందితో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాణిసుష్మిత, ఎన్నికల డీటీ వెంకటేశులు, డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు పాల్గొన్నారు.

బస్సుయాత్రను విజయవంతం చేయండి

యాడికి, జనవరి31: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం నుంచి మండలంలో నిర్వహించనున్న బస్సుయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం యాడికిలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం గుడిపాడు గ్రామం నుంచి బస్సుయాత్రను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండలంలో 9రోజుల పాటు బస్సుయాత్ర కొనసాగనున్నట్లు తెలిపారు.

జీడిపల్లిలో 0.458 టీఎంసీల నీరు

బెళుగుప్ప, జనవరి 31: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో 0.458 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు బుధవారం తెలిపారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 435 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 400 క్యూసెక్కులు ఉన్నట్లు వివరించారు.

ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్‌తో పదోతరగతి విద్యార్థులు

బెళుగుప్ప, జనవరి 31: మండలంలోని వెంకటాద్రిపల్లి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ మండల గౌరవాధ్యక్షులు, పూర్వ విద్యార్థి ఉప్పర శ్రీనివాసులు బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థులు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలన్న ఉద్దేశంతో 43 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్నామన్నారు. పాఠశాల హెచ్ఎం బాలాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తగ్గిన చింతపండు ధర

రాయదుర్గం రూరల్, జనవరి 31: పట్టణంలోని మార్కెట్‌లో నిర్వహించిన చింతపండు వేలంలో గత వారం కంటే ఈ వారం ధరలు తగ్గినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మార్కెట్‌లో చింతపండు అమ్మకానికి రైతులు తీసుకొచ్చినట్లు తెలిపారు. చపాతి రకం రూ. ఆరువేలు నుండి రూ.9,900 వరకు పలికిందన్నారు. కర్పూలి రకం రూ. 12,400 నుంచి 16,300 ధర పలికినట్లు తెలిపారు.

ఘనంగా ముగిసిన జాతర


విరుపాపల్లిలో అలంకరణలో అమ్మవారు

బెళుగుప్ప, జనవరి 31: మండలంలోని బూదివర్తి, విరుపాపల్లి, గంగవరం గ్రామాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రామదేవతల జాతర బుధవారం ఘనంగా ముగిసింది. మంగళవారం రాత్రి గండ దీపోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తుల రాకతో ఈ గ్రామాలు కిటకిటలాడాయి.

ఘనంగా దేవమ్మదేవి ఊరు దేవర

కణేకల్లు, జనవరి 31: మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో వెలసిన దేవమ్మ, దుర్గమ్మదేవి ఊరు దేవర బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గంగపూజ నిర్వహించి మేటి కుంభాన్ని ఊరేగించారు. అనంతరం దీప మహోత్సవాన్ని నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్రలోని ఇతర ప్రాంతాల నుండి బంధువులు దేవర మహోత్సవానికి హాజరయ్యారు.

జాగ్రత్తలతోనే ప్రయాణం సురక్షితం

బెళుగుప్ప, జనవరి 31: ప్రతి ఒక్కరు ప్రయాణంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలకు గురికాకుండా సురక్షితంగా ఉంటారని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అతికా నవాజ్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక శ్రీనివాస విద్యానికేతన్‌లో ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

పనులు కల్పించకపోతే చర్యలు

యల్లనూరు, జనవరి31: కూలీలకు ఉపాధి పనులు కల్పించకపోతే చర్యలు తప్పవని ఏపీఓ షబ్బీర్‌బాషా తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఏపీఓ మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో చేసిన ప్రతి పనికి సంబంధించి రికార్డులు సిద్ధం చేయాలని టెక్నికల్ సిబ్బందిని ఆదేశించారు.

వేతనాలు చెల్లించాలి


ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

తాడిపత్రిటౌన్, జనవరి 31: వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గన్నెవారిపల్లి పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం జీతాలు చెల్లించకపోవడంతో వారు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. అనంతరం ఎంపీడీఓ రంగారావుకు వినతి పత్రం అందించారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు రామాంజి, ధనలక్ష్మి, కార్మికులు రాజు, రామకృష్ణ, సంధ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.